సాక్షి ఆదిలాబాద్

బుధవారం : 30 : ఆగస్టు : 2023



అనుబంధాల రాఖీ 8లో▸

సోదరీ సోదరుల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ వచ్చేసింది. మార్కెట్ సందడిగా మారింది.

2న హైకోర్టు జడ్జి రాక

ఆదిలాబాద్‌టౌన్: హైకోర్టు జడ్జి జస్టిస్ సూరెపల్లి నంద సెప్టెంబర్ 2న ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మహిళ సాధికారత అంశంపై నిర్వహించనున్న అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0/24.0

వాతావరణం పొడిగా ఉండి గాలిలో తేమ శాతం పెరగనుంది. పలు చోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే ఇంటి ముట్టడి



ఎమ్మెల్యే ఇంటి ఎదుట బైఠాయించిన 'ఆశ'లు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించామని తెలిపారు. కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఇందులో ఆశ కార్యకర్తలు లత, ఆశ, మాధవి, పుష్పలత, రజీన, పద్మ, సుజాత పాల్గొన్నారు.

బోథ్ డివిజన్ ఏర్పాటు చేయాలని వినతి



మంత్రిని కలిసిన జెడ్పీటీసీ సంధ్యారాణి

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని కోరుతూ స్థానిక జెడ్పీటీసీ సంధ్యారాణి మంగళవారం మంత్రి హరీశ్‌రావును కలిసి విన్నవించారు. కాగా డివిజన్ ఏర్పాటు కోసం మంత్రికి జెడ్పీటీసీ విన్నవించడం ఇది మూడోసారి. ఎన్నికల్లోపు నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కాగా బోథ్ సీహెచ్‌సీని వంద పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్ ఉన్నారు.

15వ రోజుకు కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సమ్మె



చెవిలో పూలతో నిరసన వ్యక్తం చేస్తూ..

కైలాస్‌నగర్: ఎలాంటి రాత పరీక్ష లేకుండా తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శిబిరంలో ఏఎన్‌ఎంలు మంగళవారం చెవిలో పూలతో వినూత్న నిరసన తెలిపారు. ప్రజా రోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పుష్ప, సావిత్రీ, ఆనందబాయి, విజయసుందరి, వెంకటమ్మ, పద్మ, పాల్గొన్నారు.

బతుకమ్మలతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతూ..

కైలాస్‌నగర్: తమ సేవలు క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన రెండో రోజుకు చేరింది. మంగళవారం కలెక్టరేట్ నుంచి కుమురంభీంచౌక్, ఎన్టీఆర్‌చౌక్ వరకు బతుకమ్మలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి మద్దతు ప్రకటించారు.

రేపు జాబ్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 31న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాత్నాల క్వార్టర్స్‌లో గల జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో నిర్వహించే మేళాలో ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. డెలివరీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు పదో తరగతి, ఆపై చదివిన 18 నుంచి 35ఏళ్ల లోపు పురుషులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని, వేతనం రూ.22వేల నుంచి రూ.30వేల వరకు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల యువకులు బయోడెటా, విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7993913695, 9490923080 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హమ్మయ్య..



బండ భారం తగ్గిందోచ్

- గృహావసర గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గింపు
- 'ఉజ్వల' లబ్ధిదారులకు రూ.400
- తక్షణం అమలులోకి..

జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్ల వివరాలు :
గ్యాస్ ఏజెన్సీలు : 17
సింగిల్ కనెక్షన్లు : 1,01,462
డబుల్ కనెక్షన్లు : 37,623
'ఉజ్వల' కనెక్షన్‌దారులు : 36,098

కైలాస్‌నగర్: మహిళలకు కేంద్ర ప్రభుత్వం రాఖీ పండగ కానుకగా తీపి కబురు అందించింది. గృహావసర గ్యాస్ సిలిండర్ ధర రూ.200 తగ్గిస్తూ మంగళవారం నిర్ణయించింది. ప్రధాన మంత్రి ఉజ్వల స్కీం లబ్ధిదారులకు మరో రూ.200 తగ్గించాలని సంకల్పించింది. ఈ నిర్ణయంతో జిల్లాలోని 2,15,884 మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది. భారీగా పెరిగిన వంట గ్యాస్ ధరతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ నిర్ణయం కొంత ఊరటనిచ్చింది. తక్షణమే అమలులోకి రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఎల్పీజీ సిలిండర్‌పై రూ.200 తగ్గింపు

గృహావసరానికి వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం జిల్లాలో రూ.1,182 ఉంది. ఇటీవల నిత్యావసర ధరలు పెరగడంతో పాటు వంట గ్యాస్ ధర భారీగా ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతోంది. దీనిపై ప్రతిపక్షాలు సైతం పలు మార్లు ఆందోళనలు చేపట్టాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీ సిలిండర్ ధర తగ్గించాలని నిర్ణయించింది. జనరల్ కనెక్షన్ సిలిండర్‌పై రూ.200 తగ్గించింది. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు అందించిన ఉజ్వల గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులకు ఇది వరకు రూ.200 సబ్సిడీని అందిస్తుండగా తాజాగా మరో రూ.200 ఇవ్వనున్నట్లుగా ప్రకటించింది. దీంతో వారికి ఒక్కో సిలిండర్‌పై రూ.400 తగ్గనుంది. మధ్య తరగతి కుటుంబం సగటున 45 రోజులకు ఒక సిలిండర్ ఉపయోగిస్తుండగా, ఉజ్వల కనెక్షన్‌దారులు మూడు నెలలకు ఒకటి చొప్పున ఉపయోగిస్తున్నట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని గ్యాస్ కనెక్షన్లకనుగుణంగా ప్రతి నెలా 80వేల సిలిండర్లు వినియోగమవుతున్నట్లుగా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన కేంద్రం ఒక్కో సిలిండర్‌పై రూ.200 తగ్గించడంతో ప్రతి నెలా వినియోగదారులకు రూ.కోటి 60లక్షల వరకు ఆదా కానున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

కొంత నయమైంది..



అన్ని రకాల నిత్యావసర ధరలు పెరిగి బతకడం కష్టంగా మారింది. వంట గ్యాస్ ధర కూడా అలాగే ఉంది. సిలిండర్ దాదాపు రూ.1,200 అయింది. మా లాంటి పేద, మధ్య తరగతి వాళ్లకు చాలా ఇబ్బందికరమే. ఎట్టకేలకు కేంద్రం రూ.200 తగ్గించడం మా లాంటి వాళ్లకు ఎంతో కొంత మేలు చేసినట్లే.

– అయిటి లలిత, పిప్పల్‌కోటి , తాంసి

భారం జెర తగ్గినట్లే..



మహిళలు వంటకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే కేంద్రం ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద వంట గ్యాస్ కనెక్షన్లను ఉచితంగా ఇచ్చింది. అయితే సిలిండర్ ధర పెరిగిన క్రమంలో రూ.200 సబ్సిడీ ఇచ్చినా.. దాదాపు రూ.వెయ్యి వరకు ఉండడంతో కొనుగోలు చేయడం భారమైంది. ఇప్పుడు మరో రూ.200 సబ్సిడీ ఇస్తున్నట్లుగా ప్రకటించడంతో భారం జెర తగ్గినట్లయింది.

– శాంతాబాయి, బుర్కపల్లి, నేరడిగొండ

క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే జోగు రామన్న
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ



ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడాజ్యోతి వెలిగించిన అనంతరం స్టేడియం ఆవరణలో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. త్వరలోనే క్రీడాకారులకు క్రీడా పరికరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. స్థానిక తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారని కొనియాడారు. మేజర్ ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని జిల్లా క్రీడాకారులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పరుగు పందెం పోటీలో విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించారు. అనంతరం హాకీ పోటీలను ప్రారంభించారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ వజ్రమాల, కేకే స్విమ్మింగ్ అకాడమీ నిర్వాహకులు కృష్ణ, శిక్షకులు కబీర్ దాస్, రాజు, డీఎస్ఏ సిబ్బంది ఇక్బాల్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో రాణించిన విద్యార్థినికి సన్మానం

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన కొత్తురి లాస్యను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామన్న సన్మానించి మెమోంటో అందజేశారు. లాస్య గతేడాది జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించింది.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా డ్యాన్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. క్రీడాకారులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గణేశ్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీమేష్, ప్రధాన కార్యదర్శి సత్య మాస్టర్, కోశాధికారి ప్రశాంత్, స్విమ్మింగ్ కోచ్ కృష్ణ పాల్గొన్నారు.

పది స్థానాలు.. 94 మంది దరఖాస్తు

- కాంగ్రెస్ టికెట్లకు పోటీ తీవ్రం

నియోజకవర్గం	దరఖాస్తులు
బోథ్	18
ఖానాపూర్	15
చెన్నూరు	13
ఆసిఫాబాద్	10
బెల్లంపల్లి	10
ఆదిలాబాద్	08
మంచిర్యాల	07
నిర్మల్	05
ముథోల్	04
సిర్పూర్	04

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 94 మంది అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఖానాపూర్ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖానాయక్, అలాగే ఆమె భర్త రిటైర్డ్ రవాణాశాఖ అధికారి శ్యామ్ నాయక్ ఆసిఫాబాద్‌కు దరఖాస్తు చేశారు. బెల్లంపల్లికి మాజీ మంత్రి వినోద్, మంచిర్యాలకు మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు వంటి సీనియర్ నాయకులు దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు. గతంలో పోటీ చేసిన వారితోపాటు కొత్తవారు, పార్టీలో చేరనివారు సైతం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా బోథ్ నుంచి 18 మంది, అత్యల్పంగా సిర్పూర్, ముథోల్ నుంచి నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి తుది పేర్లను ఏఐసీసీ స్థాయిలో పరిశీలనలు చేసి ప్రకటించే అవకాశం ఉందని పార్టీ నాయకులు తెలిపారు.

ఎన్నికల రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేలా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై సెక్టార్, సెక్టార్ పోలీస్ అధికారులతో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకునే సమయం, దూరం ఆధారంగా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఇంటర్నెట్, రహదారి సౌకర్యం లేని కేంద్రాలను గుర్తించాలని, సెక్టార్, సెక్టార్‌పోలీస్ అధికారులు, తహసీల్దార్లు సమన్వయంతో పూర్తి నివేదికలను శుక్రవారంలోగా సమర్పించాలని ఆదేశించారు. అనంతరం ఐ ఓట్ ఫర్ ష్యూర్‌పై అధికారులకు అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకే 'ఉన్నతి'

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చే విధంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడమే ఉన్నతి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యార్థి బీఈడీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మూడు రోజుల 'ఉన్నతి' హిందీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు మరిన్ని మెలకువలు నేర్చుకొని విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర సమన్వయకర్త ముజఫర్, డీఈవో సీసీ రాజేశ్వర్, డీఆర్పీలు వినాయక్, జాకీర్ హుస్సేన్, రవి జాబడే, గోమూత్ రెడ్డి, సుకుమార్ పెట్కులే, ఆయా మండలాల హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల అనుమతి రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు డీఈవో కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. రాంనగర్‌లో అనుమతి లేకుండా ఓ పాఠశాల పేరిట తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గుర్తింపు లేకుండా కొనసాగుతున్న పాఠశాలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం సమర్పించారు. ఇందులో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గణేశ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, సలాం, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నగేశ్ అడుగులెటో..?

- బీజేపీలో చేరుతారనే ప్రచారం
- ఆ పార్టీ అభ్యర్థిత్వం ఖరారు చేస్తేనే ముందడుగు
- 2014లో టీడీపీ వీడి బీఆర్ఎస్ చేరికలోనూ ఇలాంటి ట్విస్టే
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో వెలుగు వెలిగిన మాజీ మంత్రి



గొడం నగేశ్

సాక్షి,ఆదిలాబాద్: బీఆర్ఎస్ బోథ్ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎంపీ గొడం నగేశ్ ఆ పార్టీని వీడుతారా.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బరిలో ఉండటం ఖాయమా.. అంటే ఆయన అనుచరుల నుంచి అవుననే సమాధానమే వస్తుంది. అయితే ఈ విషయంలో నగేశ్ మాత్రం స్తబ్దుగా ఉన్నారు. తెరవెనుక ప్రయత్నాలు మాత్రం జోరుగా సాగుతున్నాయనే ప్రచారం సాగుతుంది. 2014లో టీడీపీని వీడి బీఆర్ఎస్‌లో చేరిక ముందు కూడా ఆయన ఇదే ఫార్ములా పాటించారని చెబుతున్నారు. అప్పట్లో సరిగ్గా లోకసభ ఎన్నికలకు ముందు 2014 మార్చి 3న టీడీపీని వీడి బీఆర్ఎస్‌లో చేరగానే ఎంపీ టికెట్‌కు ఆయన పేరు ఖరారు చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. ఇప్పుడు కూడా అభ్యర్థిత్వం విషయంలో పార్టీ పరంగా సుముఖత వ్యక్తమైతే ఆయన బీజేపీలో త్వరలోనే చేరుతారనే ప్రచారం సాగుతుంది.

ఓ వెలుగు వెలిగిన మాజీ మంత్రి..

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మాజీ మంత్రి గొడం నగేశ్ ఓ వెలుగు వెలిగారు. ప్రస్తుతం కొంత ప్రతికూలత పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆయన వాటి నుంచి బయటపడి మునపటి స్థితిలోకి రావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే బీఆర్ఎస్‌లో బోథ్ అసెంబ్లీ టికెట్ ఆశించినప్పటికీ ఆ పార్టీ నుంచి అనిల్‌జాదవ్ పేరు ఖరారు కావడంతో నిరాశ చెందారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో పార్టీ పరంగా ఏదైన హామీ లభిస్తుందా అంటే అలాంటి పరిస్థితి కూడా లేకపోవడంతో ప్రస్తుతం మౌనంగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లోనూ కనిపించడం లేదు. అనుచరులతో కలివిడిగా ఉండటం లేదు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం, అంతే కాకుండా బోథ్ నియోజకవర్గంలో తన అనుచరులకు అవకాశాలు అందివచ్చే విధంగా ప్రయత్నాలు చేయడం ద్వారా రాజకీయాల్లో గత ప్రభావాన్ని చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు. 1994లో టీడీపీ ఎమ్మెల్యేగా బోథ్ నుంచి గెలుపొందిన ఆయన మొదటి ప్రయత్నంలోనే గిరిజన సంక్షేమ శాఖ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 1999, 2009లోనూ టీడీపీ నుంచే ఆయన బోథ్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.

తండ్రి వారసత్వంగా..

గొడం నగేశ్ తండ్రి రామారావు 1985, 1989లో వరుసగా రెండు సార్లు బోథ్ ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి గెలుపొందారు. 1994లో తండ్రి వారసత్వంగా టీడీపీ నుంచి నగేశ్‌కు టికెట్ కేటాయించారు. అయితే 2004లో నగేశ్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయగా, అప్పట్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన సోయం బాపురావు చేతిలో ఓటమి చెందారు. అప్పట్లో నగేశ్ అభ్యర్థిత్వాన్ని తండ్రి రామారావే వ్యతిరేకించారనే వార్తలు వచ్చాయి. ఇదిలా ఉంటే 2014లో బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత ఎంపీగా గెలుపొందిన నగేశ్ 2019 ఎన్నికల్లో మాత్రం బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు చేతిలో ఓటమి పాలయ్యారు. మళ్లీ గెలుపొందడం ద్వారా క్రియాశీలక రాజకీయాల్లో రాణించాలని ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ ముఖ్య నాయకులను ఆయన కలిశారనే ప్రచారం జరుగుతుంది. అయితే ఈ విషయంలో నగేశ్ ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడం గమనార్హం.

ముగిసిన లక్కీ డ్రా

- వాయిదా పడిన వైన్స్‌ల ఎంపిక ప్రక్రియ పూర్తి
- మూడు షాపులు దక్కించుకున్న భార్యభర్తలు



లక్కీడ్రా తీస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో 2023–25 ఎక్సైజ్ నూతన మద్యం పాలసీకి సంబంధించిన వైన్స్ షాపుల లక్కీ డ్రా ప్రక్రియ ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 40 మద్యం దుకాణాలుండగా వాటి కేటాయింపునకు ఈ నెల 21న జిల్లా కేంద్రంలో లక్కీ డ్రా నిర్వహించారు. అయితే తక్కువ దరఖాస్తులు వచ్చాయనే కారణంతో ఆ రోజు వాయిదా వేసిన తొమ్మిది షాపులకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తిరిగి డ్రా చేపట్టారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ డ్రా తీసి షాపులు పొందిన వారి పేర్లను ప్రకటించారు. అప్పటికప్పుడు కేటాయింపు పత్రాలను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిసెంబర్ 1నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానుంది. కార్యక్రమంలో డీపీఈవో హిమశ్రీ, ఎక్సైజ్‌శాఖ సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబాన్ని వరించిన అదృష్టం

ఈ డ్రాలో మంచిర్యాల జిల్లాకు చెందిన కావేటి మహేందర్ కుటుంబాన్ని అదృష్టం వరించింది. మంగళవారం ప్రకటించిన లక్కీ డ్రాలో ఆయన పేరిట ఏకంగా రెండు షాపులు దక్కించుకోగా అతడి భార్య పేరిట మరో షాపు దక్కడం గమనార్హం. అలాగే ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన జాదవ్ విశాల్‌కు మంగళవారం కుమారుడు పుట్టగా లక్కీ డ్రాలో ఆయన సైతం మద్యం షాపు దక్కించుకున్నాడు. పుత్రోత్సాహంతో పాటు షాపు దక్కడంతో వారి ఆనందం రెట్టింపైంది.

గిరిజన సంప్రదాయాలు గొప్పవి



గ్రామంలో కాలినడకన పర్యటిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, తదితరులు

సిరికొండ: గిరిజన సంప్రదాయలు గొప్పవని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రిమ్మ గ్రామన్ని మంగళవారం ఆయన ట్రెయినీ సివిల్ సర్వీసెస్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజనుల సంప్రదాయలు ఉన్నతమైనవన్నారు. గతంలో ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా పని చేస్తున్నప్పుడు ఈ గ్రామాన్ని సందర్శించానని చెప్పారు. 41ఏళ్ల తర్వాత మళ్లీ గ్రామానికి వచ్చానన్నారు. అప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయన్నారు. అయితే గిరిజన సంప్రదాయంలో మాత్రం ఎలాంటి మార్పు లేదన్నారు. ఆయన వెంట ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఏడుగురు ట్రెయినీ అధికారులు, ఎంపీడీవో సురేశ్, స్థానిక ఎంపీపీ అమృత్‌రావు, సర్పంచ్ అనిల్ కుమార్, గ్రామ పటేల్ శంకర్, తదితరులున్నారు.

అద్దె ఇక్కట్లు ఇంకెన్నాళ్లు..?

- ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌కు సొంత భవనం కరువు
- అరకొర వసతుల మధ్య శిక్షణ
- పట్టించుకోని పాలకులు
- అభ్యర్థులకు తప్పని తిప్పలు



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీస్టడీ సర్కిల్‌సెంటర్

ఆదిలాబాద్‌రూరల్: వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆయా సంక్షేమ శాఖల పరిధిలోని స్టడీ సర్కిల్ సెంటర్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా 2016 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే పలు నోటిఫికేషన్లకు సంబంధించి కోచింగ్ ఇస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. అయితే శిక్షణ తరగతులు అరకొర వసతుల నడుమ ఉన్న అద్దె భవనంలో కొనసాగుతుండడం అభ్యర్థులకు ఇబ్బందిగా మారింది.

వసతులు అంతంతే..

ఈ సెంటర్‌లో బ్యాచ్‌కు వంద చొప్పున 1,200 మంది అభ్యర్థులకు ఇప్పటి వరకు శిక్షణ ఇచ్చినట్లు స్టడీ సర్కిల్ సెంటర్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇందులో 163 మంది వివిధ ఉద్యోగాలు సాధించారని పేర్కొంటున్నారు. అయితే అరకొర వసతులతో కూడిన అద్దె భవనంలో ఏళ్లుగా ఇబ్బందులు తప్పడం లేదని అభ్యర్థులు పేర్కొంటున్నారు. స్టడీ హాల్‌తో పాటు అభ్యర్థుల సంఖ్యకు సరిపడా గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఏడేళ్లు గడుస్తున్నా సొంత భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సొంత భవన నిర్మాణం పూర్తి చేయాలని దళిత సంఘాల నాయకులు, శిక్షణార్థులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎస్సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో స్థలం కేటాయిస్తామని చెప్పారు. మంజూరు కాగానే భవన నిర్మాణ పనులు మొదలవుతాయి.

– డాక్టర్ రమేశ్, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్

క్లుప్తంగా

నేడు భైంసాకు చాలీసా పారాయణ రథయాత్ర

భైంసాటౌన్‌: తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీ హనుమద్దీక్షాపీఠం, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన కోటి హనుమాన్‌ చాలీసా పారాయణ మహాయజ్ఞ రథయాత్ర బుధవారం ఉదయం భైంసాకు చేరుకోనుంది. పీఠాధిపతి దుర్గాప్రసాద్‌ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పాలజ్‌ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర భైంసాలోని పిప్రికాలనీ నుంచి శివాజీ చౌక్‌, బస్టాండ్‌, కుబీర్‌ చౌరస్తా, వెంకటేశ్వర మందిర్‌, పోలీస్‌ స్టేషన్‌, కిసాన్‌ గల్లి మహదేవ్‌ మందిర్‌ మీదుగా శ్రీ సరస్వతి శిశు మందిర్‌కు చేరుకుంటుంది. అనంతరం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రవచనాలు ఉంటాయని విశ్వహిందూ పరిషత్‌ మహిషా శాఖ, అఖిల భారతీయ హనుమాన్‌ దీక్ష స్వాములు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

భైంసా డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి అవార్డు

భైంసాటౌన్‌: భైంసాలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ అధ్యాపకుడు డాక్టర్‌ పవన్‌కుమార్‌ శ్రీగురు సక్సేనా కావ్య గౌరవ సమ్మాన్‌-2023 అవార్డుకు ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఏటా గురుకుల్‌ పరివార్‌ భారత్‌ ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేస్తారు. హిందీ కావ్య రచన ఛందోబద్ధంగా రాసినందుకు, గురుకుల్‌ పరివార్‌లో అహర్నిశలుగా పాల్గొన్నందుకు ఈ పురస్కారం లభించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌ డా ఎం.సుధాకర్‌, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

దొంగల హల్‌చల్‌



రైల్వేట్రాక్‌పై ఓ అనుమానితుడిని విచారిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో దొంగలు హల్‌చల్‌ సృష్టించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్‌ వివరాల ప్రకారం... స్థానిక ముఖరాం చౌరస్తాలోని సమీపంలోని ఐదు మెడికల్‌ షాపులు, ఒక కిరాణం షాపులో దొంగలు పడ్డారు. కాగా దోతుల రవికి చెందిన అభయ్‌ కిరాణం షాపులో జరిగిన దొంగతనంలో రూ.10వేలు నగదు, ఏటీఎం, క్రెడిట్‌ కార్డులు చోరీకి గురైనట్లు తెలిపారు. మిగత ఐదు మెడికల్‌ షాపుల్లో నగదు చోరీకి గురికాలేదు. మంగళవారం ఉదయం ఎప్పటిలాగే దుకాణాలను తెరిచేందుక వచ్చి చూడగా షెట్టర్లు పగలగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు భావించిన మెడికల్‌ షాపు యజమాని రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుబంధాల రాఖీ

రాఖీ పండుగంటే సోదరి, సోదరుడి మధ్యన ప్రేమానుబంధానికి ప్రతీక. హిందువుల పంచాంగం ప్రకారం ఈ ఏడాది అధిక మాసంతో రాఖీ పౌర్ణమితో సహా అనేక పండుగలు, ఉపవాస దీక్షలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి తిథి నాడు రాఖీ పండుగను జరుపుకుంటారు. నేడు 30న బుధవారం శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి ఉదయం 10:58 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 7:05కు ముగుస్తుంది. దీంతో ఈసారి రెండు రోజులు పండుగను జరుపుకోవచ్చని పండితులు చెబుతున్నారు. ఆడపడుచును మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్ట సుఖాల్లో, సుఖ సంతోషాల్లో మేమున్నామనే భరోసాను అక్కాచెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. రేపు ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ఘనంగా జరుపుకోనున్నారు.

– కెరమెరి(ఆసిఫాబాద్‌)/నిర్మల్‌ఖిల్లా



తమ్ముళ్లకు రాఖీలు కడుతున్న సోదరి

- నేడు రేపు రాఖీ పౌర్ణమి
- దేవతలు, రాజుల కాలం నుంచి వస్తున్న ఆచారం
- కిటకిటలాడుతున్న రాఖీ స్టాళ్లు

ప్రచారంలోని కొన్ని కథలు..

దేవతల కాలం నుంచి.. శ్రీరాముడికి కౌసల్య రాఖీ కట్టిందని, రాక్షసుడు విష్ణు భక్తుడైన బలికి మహాలక్ష్మి రాఖీ కట్టి మృత్యువు నుంచి కాపాడిందని, శకుంతల తన గారాల కొడుకు భరతునికి శత్రుభయం లేకుండా తాయిత్తు కట్టిందని కథలు ఉన్నాయి. దేవేంద్రుడు సకల రాక్షసుల మధ్య పన్నెండు సంవత్సరాలు మహాయుద్ధం జరిగింది. ఈ సందర్భంలో రాక్షస రాజు ముల్లోకాలను జయించాడు. పరిస్థితిని గుర్తించిన బృహస్పతి ఇంద్రుడికి విజయం కలుగాలని ఇంద్రాణితో ఇంద్రుడికి రక్ష కట్టించాడు. ఇది శ్రావణ పౌర్ణమి రోజున వేద పండితుల మంత్రోచ్ఛారణలో జరిగిందని పురాణాలు చెబుతున్నాయి.

సందడిగా మార్కెట్లు..

కాలానుగుణంగా రాఖీలు కొత్త కొత్త డిజైన్లలో వస్తున్నాయి. గతంతో పోల్చితే ఈసారి విక్రయాలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఆయా జిల్లా కేంద్రాల్లో భారీగా దుకాణాలు వెలిశాయి. వారం ముందు నుంచే అమ్మకాలు జోరందుకున్నాయి. గతంలోకంటే ఈసారి అనేక స్టాళ్లు వెలిశాయి. పండుగ సందర్భంగా మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. పండుగ సందర్భంగా వివిధ రకాలైన ప్రత్యేక రాఖీలను మార్కెట్‌లలో లభ్యమవుతున్నాయి.

రెండురోజుల పాటు పౌర్ణమి..

ఈ సంవత్సరం పౌర్ణమి ఆగస్టు 30 ఉదయం 10:59 గంటలకు ప్రారంభమై ఆగస్టు 31న ఉదయం 07:06 గంటలకు ముగుస్తుంది. పండగను ఆగస్టు 30, 31 రెండు రోజులు జరుపుకోవచ్చని పండితులు అంటున్నారు.

అన్నాచెల్లెల ఆత్మీయతకు ప్రతీక..

ప్రతీ ఏటా శ్రావణ పౌర్ణమి రోజు రక్షాబంధన్‌ (రాఖీ)ను అన్నాచెల్లెలు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. దుష్టశక్తులను పారదోలడానికి యుద్ధంలో విజయం సాధించడానికి రక్షా బంధన్‌ ధరించాలని శ్రీకృష్ణుడు చెప్పినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. ఏదైనా కార్యక్రమం నిర్వహించ తలపెట్టినప్పుడు రక్ష ధరించడం హైందవ ఆచారం. ఆ కార్యక్రమం ఏ విఘ్నాలు లేకుండా సజావుగా సాగాలని, అనుక్షణం లక్ష్యం గురించి గుర్తు చేసేందుకు ఈ రక్ష బంధనాన్ని ధరిస్తారు.

అన్న కోసం రాఖీ కొన్నా...



మాది సారంగాపూర్‌ మండలంలోని ఆలూరు గ్రామం. రాఖీలు, స్వీట్లు కొనడానికి నిర్మల్‌ వచ్చాను. ప్రతీ సంవత్సరం మా అన్నకు రాఖీ కడతాను. ఆదిలాబాద్‌ జిల్లా నుంచి నా దగ్గరికి వచ్చి మా అన్నయ్య రాఖీ కట్టించుకొని వెళ్తాడు. అన్ని పండగల్లో అన్నాచెల్లెల గురించి తెలియజేసే పండుగ ఇదే. ఎంత వయసు వచ్చినా అన్నాచెల్లెల అనుబంధానికి ఏదీ సాటిరాదు.

పోసాని, కొనుగోలుదారు, ఆలూర్‌, నిర్మల్‌ జిల్లా



నిర్మల్‌లోని బస్టాండ్‌ ప్రాంతంలో రాఖీలు కొనుగోలు చేస్తూ..





నిర్మల్‌లో రాఖీలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నిరుద్యోగుల ఉపాధి కోసమే జాబ్‌మేళా



ఎంపికైన అభ్యర్థులతో అధికారులు, కంపెనీల సిబ్బంది

ఉట్నూర్‌రూరల్‌: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌ బాజ్‌పాయ్‌ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికే జాబ్‌ మేళా ఏర్పాటు చేసినట్లు వైటీసీ జేడీఎం నాగభూషణ అన్నారు. మంగళవారం స్థానిక కొమురం భీం ప్రాంగణంలోని వైటీసీ ఆవరణలో ఏర్పాటు చేసిన జాబ్‌ మేళాకు ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగులు హాజరయ్యారు. 1500 ఉద్యోగ ఖాళీలను 21 కంపెనీల ద్వారా భర్తీ చేయడానికి కృషి చేసినప్పటికీ తక్కువ సంఖ్యలోనే నిరుద్యోగులు హాజరయ్యారు. ఫ్లిప్‌కార్ట్‌, అమెజాన్‌ ఫ్యూచర్‌, అపోలోఫార్మసి, రక్ష సెక్యూరిటీ లాంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. 197మంది నిరుద్యోగులను ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు పరీక్షించి 165 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కార్యక్రమంలో బీఏడ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ మెస్రం మనోహర్‌, ఎస్సై సాయన్న, అనిల్‌ ఉన్నారు.

మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

ఆదిలాబాద్‌: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు లక్కీ డ్రా ద్వారా ప్రత్యేక బహుమతులను అందజేయనున్నట్లు ఆదిలాబాద్‌ ఆర్టీసీ రీజనల్‌ మేనేజర్‌ సోలోమన్‌ పేర్కొన్నా రు. పండుగ నేపథ్యంలో 30, 31 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు లక్కీ డ్రాలో పాల్గొనవచ్చని తెలిపారు. లక్కీ డ్రాలో పాల్గొనదలిచిన మహిళా ప్రయాణికులు తా ము ప్రయాణించిన టికెట్‌ వెనకాల తమ పే రు, ఫోన్‌ నెంబర్‌ రాసి రీజియన్‌ పరిధిలోని బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్‌ బాక్స్‌లలో వేయాలని పేర్కొన్నారు. మహిళలు లక్కీ డ్రా లో పాల్గొని విలువైన బహుమతులు గెల్చుకోవాలని సూచించారు. సెప్టెంబర్‌ తొమ్మిద వ తేదీలోగా లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

డివిజన్‌ చేయకుంటే ఓట్లు వేసేది లేదు



ఎడ్లబండ్లతో ర్యాలీ తీస్తున్న రైతులు



దీక్షలో కూర్చున్న రైతులు

- రైతుల డిమాండ్‌
- ఎడ్లబండ్లతో ర్యాలీ.. అనంతరం దీక్ష చేపట్టిన అన్నదాతలు

బోథ్‌: బోథ్‌ను డివిజన్‌ చేయాలని చేస్తున్న ఉద్యమం క్రమక్రమంగా తీవ్రమవుతోంది. ఇప్పటికే దీక్షలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. మంగళవారం బోథ్‌ మండల రైతులు ఎడ్లబండ్లతో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. 45వ రోజున ర్యాలీ అనంతరం దీక్ష చేపట్టారు. దీక్ష విరమణ అనంతరం వారు మాట్లాడుతూ.. డివిజన్‌గా ఏర్పాటు చేయకుంగా ఉంటే వచ్చే ఎన్నికల్లో రైతులందరం ఓట్లు వేయమని స్పష్టం చేశారు. గిరిజన రైతులతో వందల్లో నామినేషన్లు వేయిస్తామన్నారు. వీరికి పలువురు నాయకులు, సంఘాలు మద్దతు తెలిపాయి.

అటు భక్తుల రాక... ఇటు బండరాళ్ల తొలగింపు

- జిలెటన్‌స్టిక్స్‌తో బండరాళ్ల పేల్చివేత
- భయాందోళనకు గురవుతున్న భక్తులు
- బాసర ఆలయ అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం



బండరాయికి జిలెటన్‌స్టిక్స్‌ బిగించిన దృశ్యం



ముక్కలుగా మారిన బండరాళ్లు

భైంసా: బాసర ఆలయంలో మంగళవారం ఓ వైపు భక్తులు వస్తుండగానే మరో వైపు జిలెటన్‌స్టిక్స్‌ వినియోగించి పగులగొట్టిన తీరు భక్తులకు భయాందోళనకు గురిచేసింది. బాసర ఆలయంలో గత కొన్ని రోజులుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆలయానికి తూర్పువైపున పాత లడ్డూ తయారీ కేంద్రం వద్ద భారీగా ఉన్న బండరాళ్లను తొలగించాలని నిర్ణయించారు. సుమారు రూ. 40 లక్షల నిధులతో ఈ పనులుచేపడుతున్నారు. ఉదయం వేళ పెద్ద సంఖ్యలో సరస్వతి అమ్మవారి దర్శణానికి, అక్షరాభ్యాసానికి భక్తులు వెళ్తున్నారు. అదే మార్గంలో పక్కనే ఉన్న పెద్ద బండరాళ్లను తొలగించే పని సంబంధిత కాంట్రాక్టరు భక్తులు వస్తున్న సమయంలోనే భారీ బండరాళ్లకు రంధ్రాలుచేసి జిలెటిన్‌స్టిక్స్‌ బిగించి పేల్చి ముక్కలుగా మారుస్తున్నాడు. జిలెటిన్‌స్టిక్స్‌ పేలినప్పుడల్లా భారీ శబ్దం వస్తుంది. పేల్చినప్పుడల్లా చిన్నచిన్న బండరాళ్లు సైతం భక్తులు వెళ్లే రోడ్డుపై పడుతున్నాయి. బాసర వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలోపెట్టుకుని వారు లేని సమయంలోనే ఇలాంటివాటికి అనుమతి ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. బండరాళ్లు పేల్చిన సమయంలో ఏదైన జరిగితే క్షేత్రానికి వచ్చే భక్తులకు తీరని నష్టం మిగులుతుందని పలువురు వాపోయారు. భారీ శబ్దాలకు పిల్లలు భయపడుతున్నారని వృద్ధులు, మహిళలు ఇబ్బందులుపడుతున్నారని యాత్రికులుచెబుతున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు సాయంత్రం వెళ్లి పనులను నిలిపివేశారు. భక్తులు లేని సమయంలోనే బండరాళ్లు తీయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

హత్యాయత్నం కేసులో ఒక్కరికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్‌: హత్యాయత్నం కేసులో నిర్మల్‌ న్యాయస్థానం ఒకరికి ఐదేళ్ల జైలు, జరిమానా విధించింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్‌ వివరాల ప్రకారం.. కుంటాల మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన గౌనె అశ్వినికి, లోకేశ్వరం మండల్‌ నగర్‌ గ్రామానికి చెందిన కోతుర్‌ శ్రీనివాస్‌తో 2021లో వివాహ మైంది. కొన్నిరోజులు వారి కాపురం బాగానే సాగిన తర్వాత భార్యపై అనుమానంతో హింసించడం, కొట్టడం, మానసికంగా వేధించడం మొదలుపెట్టాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి వెళ్లడంతో పెద్దమనుషుల సమక్షంలో రాజీకుదిర్చి మళ్లి అత్తగారి ఇంటికి నగర్‌కు పంపించారు. అయినప్పటికీ భర్త శ్రీనివాస్‌లో ఎటువంటి మార్పు రాలేదు. బాధితురాలు తిరిగి పుట్టినింటికి వెళ్లిపోయింది. దీంతో భార్య ఇంటికి రావట్లేదని కోపంతో 24 సెప్టెంబర్‌ 2021వ తేదీ రాత్రి సమయంలో భార్య ఇంటికి వెళ్లి కత్తితో దాడిచేశాడు. భార్య స్వల్ప గాయాలతో తప్పించుకోగా చుట్టుపక్కల వారు రాగానే అక్కడి నుంచి శ్రీనివాస్‌ పారిపోయాడు. బాధితురాలు కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శ్రీకాంత్‌ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్‌ చేసి చార్జిషీట్‌ దాఖలు చేసి కోర్టులో హాజరు పరిచాడు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వై.రమణారావు 13మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో శ్రీనివాస్‌కు ఐదేళ్ల కఠిన కారగారా శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి అజేశ్‌కుమార్‌ మంగళవారం తీర్పునిచ్చారు.

గ్రామాల్లో ట్రెయినీ ఐఏఎస్‌ల పర్యటన



గ్రామ పెద్దకు రాఖీ కడుతున్న ట్రెయినీ ఐఏఎస్‌



రైతు వేదికలో వివరాలు సేకరిస్తున్న ట్రెయినీ కలెక్టర్లు

పెంబి: మండల కేంద్రానికి నాలుగు రోజుల క్రితం ట్రెనీ ఐఏఎస్‌లు వచ్చిన విషయం తెలిసినదే.. ఈ సందర్భంగా పలు గిరిజన గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించారు. అందులో భాగంగా బంజార సంప్రదాయ దుస్తులు ధరించి వారితో ముచ్చటించారు. ముందస్తుగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కోసగుట్ట గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి నుండి ఇటిక్యాల్‌ గ్రామానికి చేరుకుని స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వారి వెంట ఎంపీవో రత్నాకర్‌రావు, సర్పంచులు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సందర్శన

దస్తురాబాద్‌: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, రైతు వేదిక, మండల పరిషత్‌ కార్యాలయాన్ని శిక్షణ కలెక్టర్లు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్‌ రాజమణి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవోలు అనిల్‌ ఉన్నారు.

పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్య



నార్వాడే ప్రతిభ (ఫైల్‌)

నర్సాపూర్‌(జి): పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బామిని(బి) గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నార్వాడే ప్రతిభ (27) ఏడాదిగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆరు నెలల క్రితం రొమ్ము ఆపరేషన్‌ జరిగింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం భైంసా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌ ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త గణేష్‌ వ్యవసాయం చేస్తుండగా వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి సూర్యవంశీ పాండురంగ్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్‌ పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడి మృతి



గైక్వాడ్‌ సాయాబ్‌రావు మృతదేహం

తలమడుగు: రైలుకింద పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రంలో నివాసం ఉంటున్న గైక్వాడ్‌ సాయాబ్‌రావ్‌ (36) రైలు ఢీకొని మృతిచెందాడు. ఉపాధి కోసం మహారాష్ట్ర నుంచి వలస వచ్చి రెండేళ్లుగా తలమడుగులో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి రైల్వేస్టేషన్‌ సమీపంలో బహిర్భూమికి వెళ్తూ రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతిచెందాడు. సయాబ్‌రావుకు చెవులు వినపడవని, దీంతో రైలు వచ్చే శబ్దం వినబడక ఢీకొన్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్‌: మహారాష్ట్రకు చెందిన యువకుడు రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు టూటౌన్‌ సీఐ అశోక్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని యవత్మాల్‌ జిల్లా ఉమర్‌ఖేడ్‌ తాలుకా టాక్లి గ్రామానికి చెందిన ఆకె ప్రద్యుమ్‌ (24) తనకున్న ఒకటిన్నర ఎకరాల వ్యవసాయ భూమిలో పత్తి పంట వేశాడు. వాగు ఒడ్డుకు చేను ఉండడంతో పత్తి పంట కొట్టుకుపోయింది. వ్యవసాయం కోసం రూ.90వేలు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై సోమవారం ఉదయం పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

సామాజిక సేవ అభినందనీయం



లోగో ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్‌: ఏజెన్సీ ప్రాంతాల ఆదివాసీ గిరిజన పిల్లలకు కెరియర్‌ గైడెన్స్‌ కార్యక్రమాలు చేపట్టడానికి గిరిజన ఉద్యోగులు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మై డ్రీమ్స్‌ కం ట్రూ లోగోను ఆవిష్కరించారు. గిరిజన పిల్లల్లో సామాజిక చైతన్యం కోసం ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కుమ్ర సాయి కృష్ణ, ప్రధానకార్యదర్శి ఆడ నగేశ్‌, ఉపాధ్యక్షులు జాదవ్‌ దివ్య, సంయుక్త కార్యదర్శి దేవేందర్‌, కోశాధికారి వినయ్‌కుమార్‌, రజినీకాంతం, మెస్రం నాగేశ్వర్‌, మాదాసు మధుకర్‌ పాల్గొన్నారు.